చిత్రలేఖనం పోటీలకు ఆహ్వానం..

దుండిగల్, జూలై 9: నిజాంపేట్ లోని సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్, స్థిరచిత్త సంస్థలు సంయుక్తంగా ఈనెల 14వ తేదీన(ఆదివారం) 1 నుంచి 10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఫౌండర్ డైరెక్టర్, ప్రముఖ నాసికా చిత్రకారులు సత్యవోలు రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మహేంద్ర హిల్స్‌లోని మహాబోధి బుద్ధ విహార్‌లో జరిగే ఈ పోటీలను మూడు కేటగిరిల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. 1 నుంచి 3వ తరగతి వరకు సబ్ జూనియర్ కేటగిరి, 4 నుంచి 6వ తరగతి వరకు జూనియర్ కేటగిరి, 7 నుంచి 10వ తరగతి వరకు సీనియర్ కేటగిరీల వారీగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతి కేటగిరిలో విద్యార్థులు చిత్రించే అంశాన్ని స్పాట్‌లోనే తెలియజేస్తామన్నారు. ప్రతి కేటగిరిలో ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4వేలు, తృతీయ బహుమతి రూ.2వేల నగదు బహుమతులతో పాటు 15 ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని తెలిపారు. అదే విధంగా ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేస్తామని అన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు ఎటువంటి ప్రవేశ రుసుము లేదని, ఈనెల 12వ తేదీ శుక్రవారంలోపు www.satguruart.comను సందర్శించి బ్రోచర్‌లోని క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అందులోని గూగుల్ ఫారం ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 99599 71679 లేదా 94904 37035లో సంప్రదించాలని కోరారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు

- వర్షాకాలం ముంపు సమస్యలపై దృష్టిసారించాలి
- అధికారులు ప్రోటోకాల్‌ను పాటించాలి : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 9 : కూకట్‌పల్లి నియోజకవర్గంలో పెండింగ్ పనులను పూర్తిచేయాలని, కాలనీలు, బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టిని సారించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌కు ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు శాలువాతో సన్మానం చేశారు. అనంతరం నియోజకవర్గంలోని పలు సమస్యలను జడ్సీకి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని లోతట్టు ప్రాంతాల్లో ముంపు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలు, బస్తీలకు సమీపంలోని చెరువులు, కుంటలలో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో దోమలు వృద్ధిచెంది ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయని, ప్రజలు విషజ్వరాలు, నిద్రలేని రాత్రులను గడపాల్సి వస్తుందని, ఈ సమస్య పరిష్కారం కావాలంటే వెంటనే చెరువుల్లో గుర్రపుడెక్కను తొలగించి, దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షంనీటి కాలువలలో వ్యర్థాలను తొలగించాలని, నాలాలు పొంగిపొర్లకుండా, మరుగునీరు రోడ్లపైకి చేరకుండా, లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో వందల కోట్ల నిధలను మంజూరు చేసి... అభివృద్ధి పనులను శంకుస్థాపన చేయడం జరిగిందని, చేపట్టిన పనులను పూర్తి చేయడం లేదన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేయాలని కోరారు.

ప్రోటోకాల్‌ను పాటించాల్సిందే...

కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజాప్రతినిధుల ప్రోటోకాల్‌ను తప్పనిసరిగా పాటించాలని, ప్రోటోకాల్ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం ఎల్లప్పుడు సహకరిస్తామని, అందుబాటులో ఉండి తమ బాధ్యతను నిర్వర్తిస్తామన్నారు. కూకట్‌పల్లి, మూసాపేట సర్కిల్ పరిధిలో కొందరు అధికారులు సరిగా పని చేయడం లేదని, పనితీరులో నిర్లక్ష్యంగా ఉన్నవారిని బదిలీపై పంపించి.. కొత్తగా సమర్థవంతమైన అధికారులను నియమించాలని కోరారు. ఎమ్మెల్యే, కార్పొరేటర్ల ప్రోటోకాల్ విషయంలో లోటుపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. అనంతరం నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ కాలనీ, మూసాపేట, బాలాజీనగర్, అల్లాపూర్, ఫతేనగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి, బాలానగర్, కూకట్‌పల్లి డివిజన్‌లకు చెందిన కార్పొరేటర్లు... డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాస్‌రావు, పగడాల శిరీష, సబీహాబేగం, పండాల సతీశ్‌గౌడ్, ముద్దం నర్సింహ యాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్‌కుమార్, పగడాల బాబురావులు, జంట సర్కిళ్ల ఉపకమిషనర్లు రమేశ్, కృష్ణయ్య, పలు విభాగాల అధికారులు ఉన్నారు.

ఎమ్మెల్యే వివేకానందను కలిసిన డీ.పోచంపల్లి డబుల్‌బెడ్‌రూం వాసులు

తాగునీటి సమస్య తలెత్తకుండా

దుండిగల్, జూలై 9: నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని వాటర్‌వర్క్స్ అధికారులను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆదేశించారు. మంగళవారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద గాజులరామారం(సర్కిల్) డివిజన్‌లోని లాల్ సాహెబ్ గూడ, డీ.పోచంపల్లిలోని డబుల్ బెడ్ రూం ఇండ్లకు చెందిన ప్రజలు ఎమ్మెల్యేను కలిసి ఆయా ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి లాల్‌సాహెబ్‌గూడలో మునుపెన్నడూ లేనివిధంగా నీటి సరఫరా వారానికి ఒకసారి మాత్రమే జరుగుతుందని, అదేవిధంగా డీ.పోచంపల్లిలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు నీటి కనెక్షన్‌లు అందించి నియోజకవర్గంలో నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం కలుగకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఫ్లై ఓవర్ పనులు సకాలంలో పూర్తిచేయాలి

దుండిగల్, జూలై 9: బాచుపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను సకాలంలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలా గోపాల్‌రెడ్డి సూచించారు. ప్రగతినగర్‌లోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మేయర్ కోలన్ నీలాగోపాల్ రెడ్డి అధ్యక్షతన కమిషనర్ రామకృష్ణారావు, ఎస్ఈ సత్యనారాయణ, హెచ్ఎండీఏ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం హెచ్ఎండీఏ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌తో కలిసి బాచుపల్లి ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు, అంగారా హోటల్ వద్ద నూతన కల్వర్టు ఏర్పాటు, ఫ్లై ఓవర్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లింక్ నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయలక్ష్మి, కాసాని సుధాకర్ ముదిరాజ్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ అధికారి సుకృతతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై వరదనీరు నిలువకుండా చర్యలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 9 : ప్రధానమైన రోడ్లపై వరదనీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేయాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్ అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలను సర్కిల్ అధికారులతో కలిసి పరిశీలించారు. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లో కల్వర్ట్ నిర్మాణా పనులను పరిశీలించి మిగిలిన పనులను పూర్తిచేయాలని, వినాయకనగర్‌లో వర్షంనీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాల్లో నీరునిల్వకుండా చూడాలని, పారిశుధ్య నిర్వహన పనులపై దృష్టిసారించాలన్నారు. హైదర్‌నగర్ డివిజన్‌లోని హోలిస్టిక్ వైద్యశాల వద్ద, ఆల్విన్‌కాలనిలలోని ఇండియన్ బ్యాంక్ వద్ద వర్షనీరు నిల్వకుండా చేసేందుకు సంబంధించిన పనులను చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీ కృష్ణయ్య, ఈఈ గోవర్ధన్‌గౌడ్, డీఈ బాలకృష్ణ, ఏఈలు శివకుమార్, శ్రావణి, రషీద్, ఏఎంహెచ్‌వో మమత, ఎస్ఎస్ మనోహర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

వర్షంనీరు నిలిచే ప్రాంతాలను పరిశీలిస్తున్న జడ్సీ అపూర్వచౌహాన్, డీసీ కృష్ణయ్య, ఈఈ గోవర్ధన్, ఏఎంహెచ్‌వో మమత

రాంగ్‌రూట్‌పై స్పెషల్ డ్రైవ్

దుండిగల్, జూలై 9: జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు మంగళవారం రాంగ్‌రూట్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సూరారం ప్రధాన రహదారిలోని మల్లారెడ్డి హెల్త్‌సిటీ, మల్లారెడ్డి నారాయణ వైద్యశాలల వద్ద నిర్వహించిన తనిఖీల్లో రాంగ్‌రూట్లో వస్తున్న 1 ఆటోతో పాటు 9 ద్విచక్ర వాహనాలను సీజ్‌చేశారు. ఈ సందర్భంగా జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం వలన ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉంటుందని.. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

అక్రమ కట్టడాల కూల్చివేతలు

మియాపూర్, జూలై 9: శేరిలింగంపల్లి జోన్ పరిధిలో అక్రమ కట్టడాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. చందానగర్ సర్కిల్‌లోని అయ్యప్ప సొసైటీలో మంగళవారం పలు అక్రమ కట్టడాలను పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు కూల్చివేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇక్కడ బహుళ అంతస్తుల భవనాలు భారీగా వెలిశాయి. వీటిపై ఫిర్యాదులు అందుకున్న అధికారులు వాటిని నేలమట్టం చేశారు. ఐదారు రోజులుగా ఈ ప్రక్రియ కొనసాగుతున్నది. అధికార, రాజకీయ, వ్యాపార పక్షాలకు చెందిన పలువురు అయ్యప్ప సొసైటీలో ఈ నిర్మాణాలు సాగిస్తున్నట్లు నిత్యం అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో జోనల్, సర్కిల్ అధికారులు వాటిపై కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్నారు. అనుమతుల్లేకుండా చేపట్టే నిర్మాణాల కూల్చివేతలు తథ్యమని అధికారులు హెచ్చరించారు.

గంపల బస్తీలో..

జీడిమెట్ల, జూలై 9: సుభాష్‌నగర్ డివిజన్ పరిధి గంపల బస్తీలో అక్రమంగా నిర్మించిన ఓ ఇంటి నిర్మాణాన్ని మంగళవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులు కూల్చివేశారు. గంపల బస్తీలో అనుమతి లేకుండా మూడో అంతస్తు నిర్మిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పాక్షికంగా కూల్చివేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నర్సింహ, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సాయిబాబాతో పాటు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌మార్కెట్లే టార్గెట్‌గా...

- మోసాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

దుండిగల్, జూలై 9: రద్దీసమయంలో సూపర్‌మార్కెట్‌కు వెళ్లి విలువైన వస్తువులను కొనుగోలు చేసి, బిల్లంగ్ వర్కర్ల కండ్లుకప్పి మోసాలకు పాల్పడుతున్న కేటుగాళ్లను బాచుపల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.5లక్షల విలువ చేసే ఓ కారుతో పాటు నిత్యావసర సరుకులను స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన బాలాజీ(40), పావనీ (35) బంధువులు. దూలపల్లిలో ఉంటున్నారు. సూపర్‌మార్కెట్లలో దొంగతనాలకు పాల్పడుతున్నారు. దొంగిలించిన వస్తువులను పలు కిరాణా షాపుల్లో తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గత నెల 23న నిజాంపేటలోని డీ మార్టుకు వెళ్లిన వీరిద్దరూ సుమారు రూ.1.5 లక్షల విలువైన సరుకులు తీసుకున్నారు. బిల్లింగ్ మాత్రం కేవలం రూ.6 వేలకు మాత్రమే చేయించి గేటు దాటించారు. గతంలోనూ పేట్‌బషీరాబాద్ పీఎస్ పరిధిలోనూ మోసాలకు పాల్పడ్డారు. ఆలస్యంగా మేల్కొన్న డీ మార్టు యాజమాన్యం వారం రోజుల కిందట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసును చాలెంజింగ్‌గా తీసుకుని, సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించి పట్టుకున్నారు. విచారణలో నేరం అంగీకరించారు. దీంతో వారి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

ఉచిత వైద్యశిబిరాలకు స్పందన

జగద్గిరిగుట్ట, జూలై 9: పేదలకోసం ఏర్పాటు చేసే ఉచిత వైద్యసేవలు వినియోగించుకోవాలని నేతలు కోరారు. జగద్గిరిగుట్ట ఎన్టీఆర్‌నగర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో స్థానికులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ కరుణాకర్, బీఆర్ఎస్ నేత అంజన్‌గౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రంగారెడ్డినగర్ డివిజన్ ఆదర్శనగర్‌లో ప్రభుత్వ వైద్యులు ఉచిత శిబిరం ఏర్పాటు చేశారు. బీపీ, షుగర్ వ్యాధులకు రక్త పరీక్షలు , మందులు పంపిణీ చేశారు. డాక్టర్ లలిత, సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్వ శంకరయ్య, వైద్య సిబ్బంది గుణపతి, విజయలక్ష్మి, రాణి, అనూష పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్ పరీక్షలో ఉత్తీర్ణత

భారత రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ బి సర్టిఫికెట్ నిమిత్తం నిర్వహించిన పరీక్షలో వివేకానందనగర్ డివిజన్‌కు చెందిన ప్రగతి డిగ్రీ కళాశాలకు చెందిన 43 మంది ఎన్‌సీసీ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించి ఏ గ్రేడ్‌ను సాధించారు. ఈ సందర్భంగా నాలుగో తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ అధికారి ఆశిష్ కల్నల్ చేతుల మీదుగా ఉత్తీర్ణత సర్టిఫికెట్లను అందుకున్నారు. ఎన్‌సీసీ విద్యార్థులను కళాశాల ప్రతినిధి రవీందర్‌రావు, ఎన్‌సీసీ అధికారి రత్నాజీలు అభినందించారు.

– మియాపూర్, జూలై 9

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

దుండిగల్, జూలై 9: కుత్బుల్లాపూర్, మూసాపేట్ మండలాల పరిధిలోని మూసాపేట్, గాజులరామారం గ్రామాల సరిహద్దుల్లో ఉన్న సర్వే నంబర్ 348/1లోని పరికి చెరువును భూఆక్రమణదారుల నుంచి కాపాడాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూనశ్రీశైలం గౌడ్ కోరారు. మంగళవారం పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి.విజేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గాజులరామారం పరికి చెరువుతో పాటు పక్కనే ఉన్న హిందూ, ముస్లిం శ్మశానవాటికలు దురాక్రమణకు గురికాకుండా కాపాడాలని కోరుతూ విజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చెరువు పరిధిలో చోటుచేసుకున్న భూకబ్జాలపై సమగ్ర దర్యాప్తు చేసి, కబ్జాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి భూపతిరెడ్డి, మాజీ కుత్బుల్లాపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి కృష్ణాగౌడ్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ కేంద్రం ప్రారంభం

అల్లాపూర్, జూలై 9: ఉచిత వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటుతో వయోవృద్ధుల ఆరోగ్యానికి చేయుతనందిస్తుందని అల్లాపూర్ కార్పొరేటర్ సబీహాబేగం అన్నారు. యూనైట్ వే ఆఫ్ హైదరాబాద్ వారు నిర్మించిన సహృదయ ఎంపవరింగ్ స్వచ్ఛంద సంస్థ డివిజన్ పరిధిలోని న్యూరామారావునగర్ కమ్యూనిహాల్‌లో ఉచిత వెల్‌నెస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం కార్పొరేటర్ సబీహాబేగం ప్రారంభించారు. కార్యక్రమంలో యూనైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ టీమ్ సభ్యులు, నియోజవర్గ బీసీసెల్ అధ్యక్షుడు నాగుల సత్యం, రామ్ రెడ్డి, ఇస్మాయిల్, అమరేందర్, శ్రీనివాస్ రెడ్డి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ ఉండని ప్రాంతాలు

దుండిగల్, జూలై 9: 33/11కేవి ప్రశాంతిహిల్స్(నిజాంపేట్)సబ్‌స్టేషన్, 11కేవీ బృందావన్‌హిల్స్, వెంకటేశ్వర ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బృందావన్‌హిల్స్ కాలనీ, సైదప్ప బస్తీల్లో కరెంట్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా 11కేవీ వజ్రప్రతీక్ ఫీడర్ పరిధిలోని వజ్రప్రతీక్ గృహసముదాయంలో మధ్యాహ్నం 12:30 నుంచి 2గంటల వరకు కరెంట్ సరఫరాను నిలిపేస్తున్నామని తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

దుండిగల్, జూలై 9: విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటుపడి తమజీవితాలను పాడు చేసుకోవద్దని బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్‌కుమార్ తెలిపారు. మంగళవారం బాచుపల్లి పోలీసుల ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీనగర్ సమీపంలోని బీవీఆర్ఐటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు 'మత్తు దురలవాట్లు'(డ్రగ్‌అబ్యూజ్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావుతో కలిసి సురేశ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుపైనే దృష్టి కేంద్రీకరించి ఎటువంటి దురలవాట్లకు లోనుకాకుండా జీవితంలో ఉన్నతస్థితిలో స్థిరపడాలన్నారు. డ్రగ్స్ విక్రయించినా, సరఫరా చేసినా, వినియోగించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బాచుపల్లి సీఐ ఉపేందర్, ఎస్ఐలతో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోదాంలో మంటలు

కుత్బుల్లాపూర్, జూలై 9: షార్ట్‌సర్క్యూట్‌తో ఓ గోదాంలో మంటలు చెలరేగిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల పైపులైన్ రోడ్డు మార్గంలో సుభాష్‌నగర్ ఐడీఏజీడిమెట్లలో శ్రీలక్ష్మి ఇండస్ట్రీస్‌లో కొంతకాలంగా షిప్‌కు ఉపయోగించే పుడ్‌షీడ్స్ గోదాంలో ఉదయం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో పక్కనే ఉన్న మరో రెండు గోదాంలు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు గమనించి పోలీసులు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా.. ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పేశారు. కాగా అప్పటికే సగానికి పైగా గోదాంలో ఉన్న సరుకు దగ్ధమైంది. తెల్లవారు జామున ఈ ప్రమాదం చోటు చేసుకోవడం అందులో పని చేసే సిబ్బంది, స్థానికులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. కాగా బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని వ్యక్తి మృతి

దుండిగల్, జూలై 9: చెట్టుకు ఉరేసుకొని ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిమైసమ్మ-దుండిగల్ ప్రధాన రోడ్డు, భౌరంపేట్‌లోని ఓంసాయిరాం ఫిల్లింగ్‌స్టేషన్(పెట్రోల్‌బంక్) వెనుక ప్రాంతంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి నైలాన్‌తాడుతో చెట్టుకు ఉరేసుకున్నట్లు సోమవారం రాత్రి పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు శవాన్ని కిందకు దింపి, మృతుడి వివరాల కోసం పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లభించలేదు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ వైద్యశాలకు తరలించారు. మృతుడి వయస్సు 30-35 ఏండ్ల మధ్యన ఉంటుందని, ఒంటిపై క్రీం కలర్‌ప్యాంట్, తెలుపు రంగు షర్ట్‌పై నిలువుగీతలు ఉన్నాయన్నారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. పెట్రోల్ బంక్ మేనేజర్ సుధాకర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కలు నాటి.. సంరక్షించాలి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, జూలై 9: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో చేపట్టిన హరితహారం కార్యక్రమంతో అడవులు పచ్చదనం పెరిగిందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తెలిపారు. పదేండ్ల పాటు నాటిన కోట్లాది మొక్కలు మహా వృక్షాలయ్యాయని చెప్పారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం వివేకానందనగర్ డివిజన్ వినాయక పార్కులో కార్పొరేటర్ రోజాదేవితో కలిసి ఎమ్మెల్యే గాంధీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతో పాటు వాటిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని.. అపుడే లక్ష్యం సిద్ధిస్తుందన్నారు. ఔషధ మొక్కలతో పాటు ఫలాలు అందించే మొక్కలను పెద్ద ఎత్తున నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రఘువీర్, పార్టీ నేతలు రంగారావు, సంజీవరెడ్డి, పెద్ద భాస్కర్‌రావు, భద్రయ్య, రాంచందర్, ఆంజనేయులు, చంద్రమోహన్, సత్యనారాయణ, జగదీశ్, రవి, ఆనంద్ పాల్గొన్నారు.

వినాయక పార్కులో వన మహోత్సవంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి తదితరులు

మొక్కలను సంరక్షించుకోవాలి

శేరిలింగంపల్లి, జూలై 9: మొక్కలు నాటడంతో సరిపెట్టుకోకుండా వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం గచ్చిబౌలి డివిజన్‌లోని జర్నలిస్టుకాలనీలో ఏర్పాటుచేసిన వనమహోత్సవంలో స్థానిక కార్పొరేటర్ గంగాధర్ రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ ఉపకమిషనర్ రజనీ కాంత్ రెడ్డి, యూడీడీ మేనేజర్లు విక్రమ్ చందా, సమీరా, బీఆర్ఎస్ పార్టీ నాయకులు చెన్నంరాజు, మంత్రిప్రగడ సత్యనారాయణ, జంగయ్య యాదవ్, సతీశ్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లోని 8వ పోలీస్ బెటాలియన్‌లో మొక్క నాటి నీరు పోస్తున్న కమాండెంట్ సన్నీ, అధికారులు, సిబ్బంది

వేమనరెడ్డి కాలనీ పార్కులో..

కొండాపూర్, జులై 9 : వన మహోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం చందానగర్ డివిజన్ పరిధిలోని వేమనరెడ్డి కాలనీ పార్కులో స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డి, చందానగర్ డీసీ వంశీకృష్ణ, శేరిలింగంపల్లి జోన్ యూబీడీ డైరెక్టర్ అనిల్‌తో కలిసి మొక్కలు నాటిన శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రఘునాథరెడ్డి, నాయకులు జనార్దన్‌రెడ్డి, ధన లక్ష్మి, అక్బర్‌ఖాన్, నరేందర్, గోపి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, జూలై 9: ఉరేసుకొని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సురేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. కొంపల్లికి చెందిన బిన్న రియాజ్ సమ్నాన్(33) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీవైద్యశాలకు తరలించి మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్న వేధింపులు తాళ లేక వివాహిత..

అల్లాపూర్, జూలై 9: వరకట్